అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people

శనివారం 30, మే 2026 | సంపుటి :03 | సంచిక :111 | పేజీలు :05 | వెల ₹5

## కొనుగోళ్లలో వేగం పెంచాలి

- రైతులకు తప్పనిసరిగా ట్రక్ షీట్ ఇవ్వాలి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- కలెక్టర్, ఎస్పీ, అధికారులతో కలిసి సమీక్ష

04





# ఎమ్మెల్యేలకు సీఎం క్లాస్

## సొంత ప్రచారంతో డబ్బా కొట్టుకోవడం ఆపండి

తెలంగాణ కాంగ్రెస్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పీఏసీ) సమావేశంలో ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్ రెడ్డి పార్టీ ఎమ్మెల్యేల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు నేతల ఏకపక్ష వైఖరి పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిస్తోందని హెచ్చరించారు. రాత్రింబగళ్లు కష్టపడిన కార్యకర్తలను విస్మరిస్తే సహించేది లేదని స్పష్టం చేస్తూ, వ్యక్తిగత ఇమేజ్ కంటే పార్టీ, ప్రభుత్వమే ముఖ్యమని హితవు పలికారు. "సొంత ప్రచారంతో డబ్బా కొట్టుకోవడం ఆపి, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి" అని ఆదేశించారు. నియోజకవర్గాల్లో నిరంతరం పర్యటిస్తూ లబ్ధిదారులతో మమేకం కావాలని, ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు సోషల్ మీడియాను వేదికగా వాడుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. -అక్షరదర్బార్, హైదరాబాద్

- మీ వ్యక్తిగత ఇమేజ్ కంటే పార్టీ, ప్రభుత్వం ముఖ్యం
- ప్రభుత్వ పథకాలను ప్రమోట్ చేయండి
- పార్టీ కార్యకర్తలను విస్మరిస్తే సహించేది లేదు
- సోషల్ మీడియాలో యాక్టివ్ అవ్వండి
- కొందరి వైఖరి పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా ఉందని ఫైర్
- పీఏసీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరికలు

02



## రైస్ మిల్లు సందర్శించిన ఎస్పీ

### ధాన్యం నిల్వలు, ప్రాసెసింగ్ విధానం పరిశీలన

అక్షరదర్బార్, భూపాలపల్లి: రైతు సమస్యల పరిష్కారానికి భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ శుక్రవారం క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఇందులో భాగంగా భూపాలపల్లి మండలం గొర్లవీడు గ్రామంలోని వెంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లును ఆయన భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, సీఐ నరేష్ కుమార్‌లతో కలిసి పరిశీలించారు. మిల్లులో వడ్ల నిల్వ, ప్రాసెసింగ్ విధానం, రోజుకు ఎంత మేర వడ్లు స్వీకరిస్తున్నారనే అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ సంకీర్త్ మాట్లాడుతూ రైతుల నుంచి సాధ్యమైనంత ఎక్కువ వడ్లను పారదర్శకంగా కొనుగోలు చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున వడ్ల లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని రైస్ మిల్ యాజమాన్యానికి సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని వడ్ల కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులను స్థానిక పోలీస్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. రోజువారీ వడ్ల కొనుగోలు, ఎగుమతులపై నివేదికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించాలని ఎస్పీ ఆదేశించారు.

## ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ జూన్ 15 నాటికి పూర్తి చేయాలి

02

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియపై అధికారులు, బీఎల్వో సూపర్వైజర్లతో సమీక్షా సమావేశం



## రౌడీ షీటర్లపై ఉక్కుపాదం మోపండి

- రాత్రి సమయాల్లో రోడ్లపై బర్త్‌డే వేడుకలు జరిపితే కఠిన చర్యలు
- ఉదయం 9 గంటలకే ప్రజలకు అందుబాటులో ఉండాలి
- నెలవారీ నేర సమీక్షా సమావేశంలో సీపీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాలు

02





## కేశవమూర్తికి పద్మశాలి నేతల సన్మానం

- కండువాతో సన్మానం, అభినందనల వెల్లువ
- పద్మశాలీల సమస్యల సాధన కోసం కలిసి రావాలని పిలుపు

అక్షరదర్బార్, హనుమకొండ: హనుమకొండ టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన గడ్డం కేశవ మూర్తికి తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం జిల్లా, రాష్ట్ర కమిటీ నేతలు శుక్రవారం కండువాతో ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన హనుమకొండ జిల్లా టీయూడబ్ల్యూజే (ఐజేయు) యూనియన్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలుపొందిన గడ్డం కేశవమూర్తి హనుమకొండలోని ఆయన పత్రికా కార్యాలయంలో పద్మశాలి సంఘం నేతలు ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత పదవులు అలంకరించి అటు జర్నలిస్టు సంఘానికి, ఇటు పద్మశాలి సమాజానికి సేవలు అందించాలని జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం కోరారు. ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, జర్నలిజంలో తనకంటూ ప్రత్యేకత చాటుకున్న కేశవమూర్తి కి పద్మశాలి సంఘం తరఫున అండగా ఉంటామన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైద్య రాజగోపాల్ మాట్లాడుతూ గత మూడున్నర దశాబ్దాలుగా జర్నలిజం రంగంలో రాణిస్తున్న కేశవమూర్తి పద్మశాలి కులానికి వన్నెతెచ్చారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పులికంటి రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షులు నల్ల సత్యనారాయణ, భద్రకాళి దేవాలయం ధర్మకర్త బింగి సతీష్ పాల్గొన్నారు.

## డెడ్ లైన్ జూన్ 15

- ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియపై అధికారులు, బీఎల్వోలు సూపర్వైజర్లతో సమీక్షా సమావేశం

అక్షరదర్బార్, హనుమకొండ: ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ జూన్ 15 నాటికి పూర్తి చేయాలని బూత్ లెవెల్ ఆఫీసర్స్, సూపర్వైజర్లను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడంపై తహసిల్దార్లు, బీఎల్ వోలు, సూపర్వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు దొర్లకుండా సక్రమంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. మ్యాపింగ్ ప్రక్రియలో డోర్ టు డోర్ సర్వే చేసి ఎటువంటి పొరపాట్లు లేకుండా సక్రమంగా నిర్వహించాలని, అవసరమైతే వివరాల నిమిత్తం పక్కనే ఉన్న కుటుంబాలను సంప్రదించాలని పేర్కొన్నారు. బూత్ లెవెల్ ఆఫీసర్లు. సూపర్వైజర్లు సమన్వయంతో ప్రతిరోజు సమయం కేటాయించి ఇంటింటా సర్వే నిర్వహించాలని తెలిపారు. అధికారులు ప్రతిరోజు మానిటరింగ్ చేసి మ్యాపింగ్ ప్రక్రియ సమర్థవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటివరకు పనిచేయని బీఎల్ఓలను తొలగించి వారి స్థానంలో నూతనంగా బీఎల్ఓలను నియమించాలన్నారు. హనుమకొండ జిల్లాలో 2012 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉన్న ప్రతి బూత్ లో వలస వెళ్లిన ఓటర్లు, మరణించిన ఓటర్లు, ఓటర్ల జాబితాలో డబుల్ పేర్లు ఉన్న వారి వివరాలు కూడా పూర్తిస్థాయిలో విచారించి ఎటువంటి పొరపాటు జరగకుండా తొలగించాలని అన్నారు. జూన్ 15 నుండి జూలై 25 వరకు నూతన ఓటర్ల నమోదు కార్యక్రమం, దరఖాస్తుల ఫారాల పంపిణీ, నూతన ఓటర్ల ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి, డీఆర్ఓ శ్రీనివాస్, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డీఎస్. వెంకన్న, తహసీల్దార్లు, బీఎల్ వోలు, సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేలకు సీఎం క్లాస్

- సొంత ప్రచారంతో డబ్బా కొట్టుకోవడం ఆపండి
- మీ వ్యక్తిగత ఇమేజ్ కంటే పార్టీ, ప్రభుత్వం ముఖ్యం
- ప్రభుత్వ పథకాలను ప్రమోట్ చేయండి
- పార్టీ కార్యకర్తలను విస్మరిస్తే సహించేది లేదు
- సోషల్ మీడియాలో యాక్టివ్ అవ్వండి
- కొందరి వైఖరి పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా ఉందని ఫైర్
- పీఏసీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరికలు



అక్షరదర్బార్, హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పీఏసీ) సమావేశంలో ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్ రెడ్డి పార్టీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కొందరు నేతల వైఖరి పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా ఉందంటూ గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం పక్కన పెట్టి, సొంత ప్రచారానికే పరిమితమవుతున్నారంటూ కొందరు ఎమ్మెల్యేలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ఏకపక్ష వైఖరి వీడాల్సిందే..

శుక్రవారం జరిగిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీలో కొందరు ఎమ్మెల్యేలు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. స్థానిక నాయకత్వాన్ని, కార్యకర్తలను సమన్వయం చేసుకోకుండా సొంత నిర్ణయాలతో ముందుకు వెళ్లడం సరికాదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి రాత్రింబగళ్లు కష్టపడిన కార్యకర్తలను విస్మరిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. అందరినీ కలుపుకొని పోయినప్పుడే పార్టీ బలోపేతం అవుతుందని హితవు పలికారు. "సొంత ప్రచారంతో డబ్బా కొట్టుకోవడం ఆపండి. మీ వ్యక్తిగత ఇమేజ్ కంటే పార్టీ, ప్రభుత్వం ముఖ్యం" అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

### సోషల్ మీడియాపై ప్రత్యేక దృష్టి పెట్టండి

మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ ప్లాట్‌ఫారమలను సమర్థవంతంగా వాడుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రతి ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ సోషల్ మీడియా ప్రచారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని సోషల్ మీడియా వేదికగా తిప్పికొట్టాలన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిని, ప్రభుత్వ విజయాలను డిజిటల్ రూపంలో ప్రజలకు చేరవేసేందుకు ప్రత్యేక విభాగాన్ని బలోపేతం చేసుకోవాలని సూచించారు.

**ప్రభుత్వ పథకాలే మనకు శ్రీరామరక్ష**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలతో పాటు ఇతర ప్రతిష్టాత్మక పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపైనే ఉందన్నారు. నియోజకవర్గాల్లో నిరంతరం పర్యటిస్తూ, లబ్ధిదారులతో నేరుగా మమేకం కావాలని సూచించారు. వ్యక్తిగత ప్రచారాల జోలికి పోకుండా, ప్రభుత్వ కార్యక్రమాల ప్రమోషన్‌కే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.

### సమన్వయంతోనే ముందడుగు..

ఈ సమావేశంలో పీఏసీ సభ్యులు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ పరంగా, ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. సీఎం రేవంత్ రెడ్డి చేసిన హెచ్చరికల నేపథ్యంలో ఎమ్మెల్యేలు తమ శైలిని మార్చుకోవాలని, సమన్వయంతో ముందుకు సాగాలని పార్టీ పెద్దలు అభిప్రాయపడ్డారు.

# రౌడీ షీటర్ల పట్ల ఉక్కుపాదం మోపండి

- రాత్రి సమయాల్లో రోడ్లపై బర్త్‌డే వేడుకలు జరిపితే కఠిన చర్యలు
- ఉదయం 9 గంటలకే ప్రజలకు అందుబాటులో ఉండాలి
- నెలవారీ నేర సమీక్షా సమావేశంలో సీపీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాలు




అక్షరదర్బార్, హనుమకొండ: చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడుతూ, సాధారణ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే రౌడీ షీటర్ల పట్ల అణిచివేత ధోరణితో (ఉక్కుపాదం) వ్యవహరించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కిట్స్ కళాశాలలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారులతో కలిసి ఆయన నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ సన్‌ప్రీత్ సింగ్ శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణపై అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

### రౌడీ షీటర్ల ఇళ్లపై ఆకస్మిక తనిఖీలు

ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు రౌడీ షీటర్లు 100 శాతం హాజరుకావాలని సీపీ స్పష్టం చేశారు. ప్రతి నెల ఒకసారి స్టేషన్ అధికారులు వ్యక్తిగతంగా రౌడీ షీటర్ల ఇళ్లను సందర్శించి తనిఖీ చేయాలన్నారు. వారి స్థితిగతులను ఆరా తీయడంతో పాటు, తనిఖీ సమయాల్లో అందుబాటులో లేని రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచి వివరాలు సేకరించాలని ఆదేశించారు.

### - రోడ్లపై బర్త్‌డే వేడుకలు జరిపితే కేసులు

నేరాల నియంత్రణలో భాగంగా రాత్రి సమయాల్లో బెల్ట్ షాపులను పూర్తిగా మూసివేయించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేయడంతో పాటు బైండోవర్ చేయాలన్నారు. నిర్ణీత సమయాల్లో షాపులను మూయించాల్సిన బాధ్యత సంబంధిత స్టేషన్ అధికారులదేనని స్పష్టం చేశారు. రాత్రి వేళల్లో రద్దీగా ఉండే ప్రాంతాలను గుర్తించి ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించాలని, రోడ్లపై పుట్టిన రోజు వేడుకలు (బర్త్‌డే సెలబ్రేషన్స్) జరుపుకునే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### హాస్టళ్లు, వలస కార్మికుల వివరాల సేకరణ

చోరీల కట్టడికై ఇతర ప్రాంతాల నుండి వచ్చి ఇళ్లతో పాటు వ్యాపార సంస్థల్లో పనిచేసే వారి వివరాలను, అలాగే స్థానిక హాస్టళ్ల నిర్వహణకు సంబంధించిన పూర్తి వివరాలను స్థానిక పోలీసులు సేకరించాలని సూచించారు. ద్విచక్ర వాహనాల చోరీలపై ఫిర్యాదు రాగానే వెంటనే కేసులు నమోదు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పెట్రోలింగ్ వాహనాల పనితీరును అధికారులు నిరంతరం సమీక్షించాలని చెప్పారు.

### ఉదయం 9 గంటలకే ప్రజలకు అందుబాటులో ఉండాలి

"మీ ఉద్యోగానికి మీరు న్యాయం చేస్తే, ప్రజలకు న్యాయం చేసినట్లే" అని సీపీ అధికారులకు హితవు పలికారు. ప్రతి పోలీస్ స్టేషన్ అధికారి తప్పనిసరిగా ఉదయం 9 గంటల నుంచే ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. నేరస్థుల అరెస్ట్ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పెండింగ్ కేసులు, దర్యాప్తు తీరు, ట్రాఫిక్ సమస్యల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై సీపీ అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డీసీపీలు అకింత్ కుమార్, దార కవిత, రాజమహేంద్ర నాయక్, అదనపు డీసీపీలు రవి, ప్రభాకర్ రావు, బాలస్వామి, సురేష్ కుమార్‌లతో పాటు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.



# గ్యారెంటీల అమలు శూన్యం

- కాంగ్రెస్ 'ప్రజాపాలన' అంతా మోసం!
- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విమర్శ

అక్షరదర్బార్, పరకాల (మే 29): రాష్ట్రంలో ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను దారుణంగా మోసం చేస్తోందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. శుక్రవారం హనుమకొండలోని తన నివాసంలో పరకాల, నడికూడ మండలాలకు చెందిన సర్పంచులు, ఉపసర్పంచులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందన్నారు. గ్రామ పంచాయతీలకు నిధులు నిలిపివేయడంతో తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిదీపాల వంటి కనీస సౌకర్యాలు కూడా దెబ్బతిన్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ నాయకత్వం లోనే గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్‌పై అప్రమత్తంగా ఉండాలని, పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వహించాలని శ్రేణులకు సూచించారు.

# మండుటెండల్లో 'నీటి' కరవు

- మున్సిపల్ పాలకవర్గం వైఫల్యం
- స్పందించాలని ముఫీనా ఫాతిమా హమీద్ డిమాండ్



అక్షరదర్బార్, పరకాల (మే 29): వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ పాలక వర్గం, అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని మాజీ మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యురాలు ముఫీనా ఫాతిమా హమీద్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో నల్లా నీళ్లు సక్రమంగా రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండుతున్న ఎండల్లో నీటి అవసరం అధికంగా ఉన్నప్పటికీ, కనీస అవసరాలకు కూడా నీరు అందక ప్రజలు అల్లాడిపోతున్నారని పేర్కొన్నారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా నల్లా నీటి సరఫరా జరిగేలా చూడాలని, అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా తక్షణమే నీటిని సరఫరా చేయాలని అధికారులను కోరారు.


# తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొమ్ము వేణు




అక్షర దర్బార్, మహబూబాబాద్ (మే 29): తెలంగాణ రాజ్యాధికార పార్టీ మహబూబాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొమ్ము వేణు నియమితులయ్యారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన పార్టీ ముఖ్య నేతల సమావేశంలో ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదు మరియు చేరికల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కమిటీ ఉత్తర్వుల ప్రకారం పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాధం రజిని కుమార్ యాదవ్.. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొమ్ము వేణును నియమించినట్లు ప్రకటించారు. నూతనంగా నియమితులైన కొమ్ము వేణుకు జిల్లాలో పార్టీ కార్యకలాపాలు సజావుగా సాగేందుకు అందరూ అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఐలయ్య, రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శి రాజు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయం

- ఓటర్ల హక్కులను కాపాడటం ప్రతి కార్యకర్త బాధ్యత
- పరకాల నియోజకవర్గ బూత్ ఏజెంట్ల శిక్షణలో ఎమ్మెల్యే రేవూరి, ఎంపీ కావ్య




అక్షరదర్బార్, ఆత్మకూరు: ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, వరంగల్ ఎంపీ శ్రీమతి కడియం కావ్య పిలుపునిచ్చారు. ఓటర్ల హక్కులను కాపాడటం, ప్రతి బూత్‌లో పార్టీ శక్తిని విస్తరించడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యతని వారు స్పష్టం చేశారు. ఆత్మకూరు మండలం గుడెప్పాడ్ క్రాస్ రోడ్డు వద్ద గల ఎన్‌ఎస్‌ఆర్ కన్వెన్షన్ హాల్ లో శుక్రవారం పరకాల నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ బూత్ ఏజెంట్స్ శిక్షణ కార్యక్రమం జరిగింది. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండి అయుబ్ లతో కలిసి ఎమ్మెల్యే రేవూరి, ఎంపీ కడియం కావ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ కడియం కావ్య పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎస్ఐఆర్ ప్రక్రియ, ఓటర్ల జాబితా నిర్వహణ, బూత్ స్థాయి బాధ్యతలపై ఏజెంట్లకు సమగ్ర అవగాహన కల్పించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జూన్ 25 నుండి తెలంగాణలో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (సర్) మూడో దశ ఓటరు నమోదు, జాబితా సవరణ కార్యక్రమం ప్రారంభం కానుందని తెలిపారు. ఈ సర్వే ద్వారా బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ తిరిగి అర్హులైన కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, చనిపోయిన లేదా వలస వెళ్లిన వారి పేర్ల తొలగింపు ప్రక్రియ చేపడతారని వివరించారు.

### అక్రమాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా నిర్వహణలో బూత్ స్థాయి అధికారులు, ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకమని చెప్పారు. అధికార బీజేపీ, ఎన్నికల సంఘం కుమ్మక్కై అర్హులైన ఓట్లను తొలగిస్తున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ "ఓటు చోరీ" పేరుతో దేశవ్యాప్తంగా, ముఖ్యంగా తెలంగాణలో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపట్టిందని గుర్తుచేశారు. ఇందులో భాగంగానే ఊరూరా భారీ ఎత్తున సంతకాల సేకరణ యుద్ధాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి బూత్ ఏజెంట్ స్థానిక ఓటర్లతో మంచి సంబంధాలు ఏర్పరచుకోవాలని, వారి సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఏవైనా డూప్లికేట్ లేదా దొంగ ఓట్లు ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జికి లేదా స్థానిక పార్టీ కమిటీకి సమాచారం అందించాలన్నారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పరకాల నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ ముఖ్య నాయకులు, వివిధ మండలాల అధ్యక్షులు, బూత్ స్థాయి ఏజెంట్లు, కాంగ్రెస్ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్పొరేట్ ఫీజుల 'దోపిడీ'పై సంతకాల సమరం

- ఫీజుల నియంత్రణకు చట్టం తేవాలని పీడీఎస్‌యూ డిమాండ్




అక్షర దర్బార్, నర్సంపేట (మే 29): రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు రకరకాల పేర్లతో అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యారంగాన్ని పూర్తిగా వ్యాపారమయంగా మార్చేశాయని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. నరసింహారావు మండిపడ్డారు. శుక్రవారం నర్సంపేట డివిజన్ కేంద్రంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో.. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని, ఫీజుల నియంత్రణకు సమగ్ర చట్టం తేవాలని కోరుతూ భారీ 'సంతకాల సేకరణ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బి. నరసింహారావు మాట్లాడుతూ.. అధికారంలో ఉన్న ప్రభుత్వాలు కార్పొరేట్ విద్యా సంస్థల నుండి ఎలక్టోరల్ బాండ్స్, కోట్ల రూపాయల ఫండ్స్ వసూలు చేస్తూ ఫీజులను నియంత్రించకుండా తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపుతున్నాయని ఆరోపించారు. ప్రతి ఏటా ఇష్టారాజ్యంగా 25 నుండి 50 శాతం ఫీజులు పెంచుతున్నా విద్యాశాఖ అధికారులైన ఎంఈఓలు, డీఈఓలు, ఆర్జేడీలు పట్టించుకోకుండా కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాయడం సిగ్గుచేటన్నారు. తక్షణమే ఫీజు నియంత్రణ కమిటీ ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంతకాల సేకరణ ద్వారా ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వానికి చేరవేసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు అలువాల నరేష్, సహాయ కార్యదర్శి దండు వినయ్, రాష్ట్ర కమిటీ సభ్యులు హర్షవర్ధన్, పి. అనూష, నాయకులు రజిని, సౌమ్య పాల్గొన్నారు.

# అవాకులు చవాకులు మానుకో

- నాగజ్యోతికి గుంటోజు పావని హెచ్చరిక
- జర్నలిస్టుల హక్కుల గురించి మాట్లాడే అర్హత మీకు లేదు



అక్షర దర్బార్, ములుగు (మే 29): రాష్ట్ర మంత్రి సీతక్కపై, కాంగ్రెస్ నాయకులపై అనవసరపు విమర్శలు చేయడం మానుకోవాలని, నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతిని ములుగు మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గుంటోజు పావని హెచ్చరించారు. ములుగు జిల్లా కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులను బెదిరిస్తోందని నాగజ్యోతి అనడం విడ్డూరమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అవినీతిని బయటపెట్టినందుకు క్యూ న్యూస్ అధినేత తీన్మార్ మల్లన్నను అక్రమంగా అరెస్ట్ చేసి జైల్లో వేసిన సంగతి, ఆంధ్రజ్యోతి ఆఫీస్‌పై దాడి చేసిన విషయం నాగజ్యోతికి తెలియదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మంత్రి సీతక్క, సీఎం రేవంత్ రెడ్డిలతో మాట్లాడి జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు, అక్రిడేషన్ కార్డులు ఇప్పించే ప్రయత్నం చేస్తున్నారని గుర్తుచేశారు. ఎక్కడో ఉండి ప్రకటనలు ఇస్తే లీడర్ కాలేరని, ప్రజాక్షేత్రంలోకి వచ్చి జరుగుతున్న అభివృద్ధిని చూడాలని హితవు పలికారు.







# ఆధ్యాత్మిక శోభ

- సరస్వతి అంత్య పుష్కరాలకు అద్భుత ఏర్పాట్లు
- త్రివేణి సంగమంలో వెల్లివిరుస్తున్న భక్తిభావం



అక్షరదర్బార్, కాళేశ్వరం : సరస్వతి అంత్య పుష్కరాలను పురస్కరించుకుని త్రివేణి సంగమంలో భక్తులను అలరించే అద్భుత ఏర్పాట్లు జరిగాయి. ఈ పుష్కరాల సందర్భంగా కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద ప్రభుత్వం, సంబంధిత శాఖలు చేపట్టిన ప్రత్యేక ఏర్పాట్లు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పవిత్ర స్నానాల కోసం పెద్ద ఎత్తున తరలివస్తున్న భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకున్నారు. త్రివేణి సంగమం పరిసర ప్రాంతాలను శోభాయమానంగా తీర్చిదిద్దుతూ ప్రత్యేక సెట్టింగ్స్ ఏర్పాటు చేశారు. రంగురంగుల లైటింగ్ అలంకరణలు, భక్తి భావాన్ని పెంపొందించే ఆధ్యాత్మిక వాతావరణం, కళాత్మక నిర్మాణాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా రాత్రి సమయంలో విద్యుత్ వెలుగుల మధ్య ఈ ప్రాంతం మరింత ఆహ్లాదకరంగా మారుతూ కనులపండువగా కనిపిస్తోంది. పున్నమి చంద్రుడి వెలుగులో త్రివేణి సంగమం మరింత అందంగా దర్శనమివ్వడం భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తోంది. పవిత్ర జలాలలో స్నానం చేస్తూ, దైవ దర్శనం చేసుకుంటూ భక్తులు ఆధ్యాత్మిక ఆనందంలో మునిగిపోతున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని భద్రతా చర్యలు కట్టుదిట్టం చేయబడినాయి. తాగునీరు, వైద్య శిబిరాలు, పారిశుద్ధ్య సదుపాయాలు, మార్గదర్శక బోర్డులు వంటి అన్ని అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉంచారు. అదనంగా ట్రాఫిక్ నియంత్రణ, ప్రత్యేక రవాణా ఏర్పాట్లు కూడా సమర్థంగా అమలు చేస్తున్నారు. ఈ సందర్భంగా అధికారులు భక్తులు క్రమశిక్షణ పాటిస్తూ, సూచనలు అనుసరించాలని కోరారు. సరస్వతి అంత్య పుష్కరాలు ఆధ్యాత్మికంగా మాత్రమే కాకుండా సాంస్కృతికంగా కూడా గొప్ప అనుభూతిని అందిస్తున్నాయి.

# కొనుగోళ్లలో వేగం పెంచాలి

- రైతులకు తప్పనిసరిగా ట్రక్ షీట్ ఇవ్వాలి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- కలెక్టర్, ఎస్పీ, అధికారులతో కలిసి సమీక్ష

అక్షరదర్బార్, భూపాలపల్లి: అకాల వర్షాల దృష్ట్యా ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం ఐడిఓసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తో కలిసి పౌర సరఫరాలు, రవాణా, వ్యవసాయ, సహకార, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో పాటు మిల్లర్లు, ట్రాన్స్ పోర్టు కాంట్రాక్టర్లు, పీఏసీఎస్ సీఈఓ లు, ఏపీఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ



మక్కల కొనుగోలులో రాష్ట్రంలో మన జిల్లా మొదటి స్థానంలో ఉన్నదని, అదే స్ఫూర్తితో ధాన్యం కొనుగోళ్లలో సైతం వేగం పెంచాలని సూచించారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా కట్టు దిట్టమైన చర్యలు చేపట్టాలని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తప్పనిసరిగా ట్రక్ షీట్ ఇవ్వాలని, ధాన్యం కాంటా జరిపిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ కచ్చితంగా చేయాలని తెలిపారు. ఐరిస్ పద్ధతిని తొలగించి ఓటిపి ద్వారా ధాన్యం కొనుగోలు చేపట్టాలని రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని,

మరో వారంలోగా కొనుగోలు పూర్తి చేయాలని సూచించారు.

### ట్రాక్టర్ల ద్వారా తరలించాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు జరిగిన వెంటనే రైతులకు ట్రక్ షీట్ ఇవ్వాలని ఆదేశించారు. ట్రక్ షీట్ ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాలలో ఖచ్చితమైన లక్ష్యం ద్వారా ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని స్పష్టం చేశారు. పీఏసీఎస్ సీఈఓలు, ఏపీఎంలు క్షేత్రస్థాయిలో పరిశీలించి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ప్రతి రోజు కచ్చితంగా 8 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు జరిగేలా చూడాలని ఆదేశించారు. లారీలు కొరత ఉంటే ట్రాక్టర్లు ద్వారా మిల్లులకు తరలించాలని, అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా ఎత్తైన ప్రదేశాలలో నిల్వ ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పౌరసరఫరాలు, సంస్థ రవాణా, డీఆర్ డీఓ, సహకార శాఖల అధికారులు, మిల్లర్లు పీఏసీఎస్ సీఈవోలు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు